క్లుప్తంగా

ఢిల్లీ ధర్నాలో జిల్లా నేతలు



పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ ఎంపీ వంగా గీత

కాకినాడ: తెలుగుదేశం పార్టీ నేతలు రాష్ట్రంలో సాగిస్తున్న దాష్టీకాలకు నిరసనగా వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలో బుధవారం తలపెట్టిన సమర శంఖానికి జిల్లా నుంచి పలువురు నేతలు తరలి వెళ్లి సంఘీభావం ప్రకటించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ ఎంపీ వంగా గీత విశ్వనాథ్‌, పార్టీ నాయకురాలు మాకినీడి శేషుకుమారి తదితరులు ధర్నాలో పాల్గొన్న వారిలో ఉన్నారు.

అయ్యంకి సేవలు అజరామరం



అయ్యంకి చిత్ర పటానికి బోట్‌క్లబ్‌ వాకర్స్‌ సంఘం నివాళులు

కాకినాడ రూరల్‌: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య అని, గ్రంథాలయ ఉద్యమానికి ఆయన జీవితాంతం విశేష కృషి చేసినట్టు విశ్రాంత గ్రంథాలయ అధికారి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్‌ వాకర్స్‌ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అయ్యంకి జయంతిని ఘనంగా నిర్వహించారు. అయ్యంకి చిత్ర పటానికి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్‌, డాక్టరు శిరీష, తదితరులు నివాళులర్పించారు.

రికార్డు రూముల పరిశీలన



రికార్డు రూములను పరిశీలిస్తున్న ఆర్డీవో కిశోర్‌

కాకినాడ సిటీ: భద్రతా పరమైన తనిఖీల్లో భాగంగా ఆర్డీఓ ఇట్ల కిశోర్‌ స్థానిక ఆర్డీఓ కార్యలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. రికార్డు రూముల వద్ద సీసీ కెమెరాలు పని తీరును పరిశీలించి, అధికారులకు పలు సూచనలిచ్చారు. భూ రికార్డుల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రికార్డు రూములో భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆర్డీవో వెంట పరిపాలనాధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి ప్రింటర్‌ బహూకరణ

కాకినాడ రూరల్‌: కాకినాడ 49వ డివిజన్‌ పరిధిలోని గైగోలుపాడు అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌కు సుమారు రూ.20 వేల విలువైన కంప్యూటర్‌ ప్రింటర్‌ను జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి ఈశ్వర్‌ బహూకరించారు. అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌లో వైద్యుడు శ్రీను చంద్ర, ఇతర వైద్యులకు బుధవారం కంప్యూటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో మల్లిపూడి మెహర్‌ చిన్ని, బాలు నగేష్‌, అనుసూరి రాజకుమారి, పెద్దా, పవన్‌, మణి, కిరణ్‌, తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి ఉదారంగా నిధులు

బోట్‌క్లబ్‌: ఏపీకి కేంద్ర ప్రభుత్వం ఉదారంగా నిధులు ఇచ్చిందని బీజేపీ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్‌ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏపీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందనే విషయం మరోసారి స్పష్టమైందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు దువ్వూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న బీజేపీ సౌత్‌ మండల అధ్యక్షులు చెక్కా రమేష్‌

బోట్‌క్లబ్‌: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బీజేపీ దక్షిణ మండల అధ్యక్షులు చెక్కా రమేష్‌ అన్నారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక 29వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరు మీద మొక్కలు నాటాలన్నారు. కాకినాడను గ్రీన్‌ సిటీగా మార్చేందుకు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జీవితం మద్యంతరం కాకూడదు

- ఇటీవలి కారు ప్రమాదం తర్వాత తనిఖీలు మరింత ముమ్మరం
- పెరిగిన బీట్లు, రాత్రి తనిఖీలు
- డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసుల నమోదులో రాష్ట్రంలోనే కాకినాడ టాప్‌
- రోడ్లపై బర్త్‌ డే పార్టీలు చేసుకునే వారిపై ప్రత్యేక నిఘా



రోడ్డు పక్కనే చీకటిలో మద్యం సేవిస్తున్న మందుబాబులను పట్టుకున్న పోలీసులు



డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ పరీక్షలు నిర్వహిస్తున్న లా అండ్‌ ఆర్డర్‌ పోలీసులు

కాకినాడ క్రైం: మద్యం మత్తు నిండు జీవితాలను చిదిమేస్తోంది. కాకినాడలో తాజాగా జరిగిన కారు ప్రమాదం మూడు కుటుంబాలను రోడ్డున పడేసి ముగ్గురు అమాయకులను పొట్టన పెట్టుకుంది. ఈ దుర్ఘటన నగరాన్ని ఒక్కసారిగా ఉలిక్కి పడేలా చేసింది. మద్యం మత్తులో వాహనం నడిపేవారి నిర్లక్ష్యం ఎందరో ప్రాణాలను బలిగొంటోంది. వారికి ట్రాఫిక్‌ నిబంధనలు పట్టవు, జరిమానాలు, కేసులు పట్టవు. ఈ నేపథ్యంలో పోలీస్‌ శాఖ అప్రమత్తమైంది. కఠిన నిబంధనలు, నియంత్రణతో మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై ఉక్కు పాదం మోపి డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసుల నమోదు చేస్తోంది. ఇటువంటి కేసుల నమోదులో మేటిగా నిలవడం అనేది పరోక్షంగా పోలీసుల వైఫల్యాన్ని చూపుతోందన్నది నిర్వివాదాంశం. నయానో భయానో చెప్పగలరే కానీ భయపెట్టి దండించి చెప్పలేకపోవడం అనేది వారి అశక్తతైనప్పటికీ వాహన చోదకంలో మద్యం భాగస్వామ్యంపై కచ్చితంగా సాంకేతికపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. కాగా ప్రయోజనకర ఫలితాల కోసం ప్రణాళికలు రచించి, విప్లవాత్మక మార్పులతో స్థానిక ట్రాఫిక్‌ విభాగం ముందుకు సాగుతోంది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ విక్రాంత్‌ పాటిల్‌ ఆ దిశగా దృష్టి సారించి మార్గనిర్దేశం చేస్తున్నారు. నేరుగా డీఎస్పీ ఆధ్వర్యంలో డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసుల నమోదు ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ ఓ ఉద్దేశ పూర్వక దుశ్చర్య

మద్యం మత్తులో చెలరేగి డ్రైవింగ్‌ చేయాలనుకునే మానసిక స్థితి ఓ ఉద్దేశపూర్వక దుశ్చర్యేనని మానసిక నిపుణులు చెబుతున్నారు. మద్యం తాగి వాహనం నడపడం వల్ల కలిగే అనర్థం చోదకుడికి పూర్తిగా తెలిసే ఈ పనికి పూనుకుంటాడంటున్నారు. రోడ్డు ప్రమాదాలలో అధిక శాతం మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే అవుతున్నాయని కాకినాడ ట్రాఫిక్‌–1 సీఐ ఎస్‌.రమేష్‌ తెలిపారు. పాఠశాల, కళాశాల స్థాయిలో మద్యం మత్తు ఫలితంగా జరిగే అనర్థాలు విద్యార్థులకు బోధించాలనీ అందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ట్రాఫిక్‌–2 సీఐ చైతన్యకృష్ణ అభిప్రాయ పడ్డారు.

ప్రమాదకర పోకడలు...

నగరంలో ప్రమాదకర పోకడలు మద్యం మత్తుకు ఆపై ప్రమాదాలకు దారి తీస్తున్నాయని పోలీసులు అంటున్నారు. ఈ మధ్య కాలంలో అర్ధరాత్రి నడిరోడ్లపై పుట్టిన రోజు సందర్భంగా కేక్‌ కటింగ్‌లు ఓ ఫ్యాషన్‌గా మారిపోయాయని తెలిపారు. కేక్‌ కటింగ్‌ తర్వాత బీర్లు పొంగించడం పరిపాటిగా మారిందనీ, ఈ బ్యాచ్‌లు మద్యం మత్తులో తూగుతూ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకుంటున్నాయని సీఐ చైతన్య కృష్ణ అన్నారు. ఇటువంటి వారు తప్పకుండా మూల్యం చెల్లించుకుంటారన్నారు. ఇటువంటి వారిపై నిఘా కొనసాగుతుందని, వారిని పూర్తి స్థాయిలో తనిఖీలు చేస్తామని చెప్పారు.

అలాగే నైట్‌ బూజర్స్‌ సమస్య నగరంలో ఈ మధ్య కాలంలో పెరిగిందని సీఐ రమేష్‌ తెలిపారు. రోడ్ల వద్ద చీకటిలో మద్యం గుటకేసి నేరుగా నడుచుకుంటూ లేదా వాహనాలతో వీరు రోడ్లెక్కుతున్నారని అన్నారు. ఇటువంటి వారు ప్రమాదాలను కొని తెచ్చుకోవడంతో పాటు ప్రమాదాలకు కారకులవుతున్నారన్నారు. ఈ పోకడలను ముఖ్యంగా యువత ఓ ఫ్యాషన్‌గా భావిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో మెప్పు కోసం ఈ ఘనకార్యాలను పోస్ట్‌ చేస్తూ మరికొందరిలో ఈ ఆలోచనలు కలిగిస్తున్నారు. ఇది ఏ మాత్రం వారి భవితకు మంచిది కాదు.

తనిఖీ బీట్లు 4 నుంచి 22కి

ట్రాఫిక్‌ విభాగంలో ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐల ఆధ్వర్యంలో బృందం డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌లు నిర్వహిస్తుండగా తాజా ప్రమాద ఘటన అనంతరం ఎస్పీ విక్రాంత్‌ పాటిల్‌ ఆదేశాల మేరకు లా అండ్‌ ఆర్డర్‌ పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. ముఖ్యంగా నైట్‌ బీట్లు కాకినాడలో ట్రాఫిక్‌ విభాగం పరిధిలో రాత్రి వేళ మసీదు సెంటర్‌, భానుగుడి, బాలాజీ చెరువు, సర్పవరం జంక్షన్లలో కొనసాగేవి. అయితే ఇప్పుడు ఆ సంఖ్య 22కి పెరిగింది. ఈ క్రమంలో వీటికి అదనంగా అన్నమ్మ ఘాటీ, జగన్నాథపురం జంక్షన్‌, ఇంద్రపాలెం జంక్షన్‌, ఎస్‌ఆర్‌కే జంక్షన్‌, నాగమల్లితోట, వలసపాకల, వాకలపూడి, ఎంఎస్‌ఎన్‌ చారిటీస్‌, గైగోలుపాడు జంక్షన్‌, గాంధీనగర్‌, రామారావుపేట, ప్రతాప్‌ నగర్‌, కరణంగారి జంక్షన్‌, అచ్చంపేట, ఆర్‌టీవో కార్యాలయం, డైరీ ఫారం, గొడారి గుంట, కోకిల జంక్షన్లలో వీటిని ఏర్పాటు చేశారు.

స్టేట్‌లో టాప్‌...

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసుల నమోదులో కాకినాడ ట్రాఫిక్‌ విభాగం ఏ మాత్రం వెనకడుగు వేయడం లేదు. సిఫార్సులు, ఒత్తిళ్లకు కూడా తలొగ్గకుండా మందుబాబుల నడ్డి విరుస్తోంది. చోదకులకు మద్యం మత్తు వదిలించడంలో పోలీసుల ఈ రాజీ లేని విధి నిర్వహణ కాకినాడను గతేడాది రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపింది. యావత్‌ రాష్ట్రంలోనే కాకినాడ ట్రాఫిక్‌ విభాగం అధికంగా డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులు నమోదు చేసి మందుబాబుల పాలిట సింహస్వప్నంగా నిలిచింది.

కనీసం రూ.10 వేల జరిమానా



డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌లపై మరింత కఠినంగా వ్యవహరించనున్నాం. ఎస్పీ ఆదేశాలతో ఉక్కుపాదం మోపుతాం. యువతే ఈ పెడత్రోవలో అధికంగా పట్టుబడుతోంది. తన సహా ఇద్దరు సీఐలు ప్రతి రోజు రాత్రి కనీసం మూడు చొప్పున తనిఖీ బీట్లు సందర్శిస్తున్నాం. రూ.50 మద్యం తాగినా కనీసం రూ.10 వేలు జరిమానా కట్టాల్సిందే. గరిష్ఠంగా రూ.25 వేల వరకు జరిమానా పడుతుంది. బ్రీత్‌ ఎనలైజర్‌లో రీడింగ్‌ 200 పాయింట్లు దాటితే కోర్టు జైలు శిక్ష విధిస్తుంది. ఎంతటివారైనా మావాడే వదిలేయండి అంటూ వచ్చే రికమండేషన్లను ఎస్పీ ఆదేశాలతో ఏ మాత్రం పరిగణించడం లేదు. అత్యధిక కేసులు నమోదు చేసి, తప్పు చేసిన వారికి జరిమానాలు విధించి జైళ్లకు పంపిన ఘనత కాకినాడ ట్రాఫిక్‌ విభాగానిదే.

– కె.హనుమంతరావు, కాకినాడ డీఎస్పీ, ఇంచార్జి ట్రాఫిక్‌ డీఎస్పీ

2023లో గణాంకాలు ఇలా ఉన్నాయి..

	కాకినాడ ట్రాఫిక్‌ 1లో	ట్రాఫిక్‌– 2లో
నమోదైన కేసులు	790	799
దోషులుగా తేలిన వారు	661	769
జైలు శిక్ష పడిన వారు	152	235
జరిమానాలు పడిన వారు	509	534
అండర్‌ ట్రయల్‌ కేసులు	129	30

ఇకపై ఇలా....

- రోడ్లపై బర్త్‌ డే పార్టీలు నిర్వహించే వారిపై ప్రత్యేక దృష్టి, తనిఖీలు
- మావాడే వదిలేయమంటే కుదరదు. ఇకపై రికమండేషన్లకు నో ఛాన్స్‌
- లా అండ్‌ ఆర్డర్‌ పోలీసులు కూడా డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ తనిఖీలు నిర్వహిస్తారు.
- ఉదయం వేళ 12 తనిఖీ బీట్లు కాస్తా 36కు పెంపు
- నగరం రాత్రి తనిఖీ కూడళ్లు 4 నుంచి 22కి పెంపు
- పట్టుబడ్డ ప్రతి తాగుబోతుకూ శిక్ష పడేలా న్యాయ చర్యలు
- ర్యాష్‌ డ్రైవింగ్‌ నిర్వహించే మహిళలు, అనుమానిత హిజ్రాలకూ డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ పరీక్షలు
- నెట్‌ బూజర్స్‌ (రోడ్లకు ఏదో మూల మద్యం తాగి రోడ్డెక్కే వారు)పై కేసులు, చట్టపరమైన కఠిన చర్యలు

విద్యతోపాటు ఆటలకు ప్రాధాన్యమివ్వాలి



నడకుదురు హైస్కూలు సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణవేణి

కరప: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు చదువుతో పాటు ఆటలకు, ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం నివ్వాలని ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ పేర్కొన్నారు. నేషనల్‌ ఎడ్యుకేషన్‌ పాలిసీ–2020 నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలం నడకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో యంగ్‌మైండ్స్‌ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జాతీయ విద్యా విధానం, స్పోర్ట్స్‌, స్పోర్ట్‌ అండ్‌ ఫిట్‌నెస్‌ గురించి ఎంఈఓలు వివరించారు. ప్రముఖ యోగా గురువు పెమ్మనబోయిడి వసంతరాముడు యోగా గురించి, దానివల్ల కలిగే ప్రయోజనాలు వివరించి, యోగా ఎలా చేయాలో తెలిపి, విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. పీడీ జేహెచ్‌ వెంకట్రావు, ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు టి.వెంకట్రావు వివిధ రకాల ఆటలను వివరించి, విద్యార్థులతో ఆడించారు. యంగ్‌ మైండ్స్‌ వ్యవస్థాపకుడు వాకాడ వెంకటరమణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, సైన్సు ప్రయోగాలు, ఆవిష్కరణలు, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా స్కిల్‌ డెవలప్‌మెంట్‌పై శిక్షణ, విద్య, ఆరోగ్యం, వైద్యం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, వేధింపులు, కిడ్నాప్‌లు నిరోధించేందుకు స్వీయ ఆత్మరక్షణపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు యంగ్‌ మైండ్స్‌ స్వచ్ఛంద సంస్థను స్థాపించినట్టు తెలిపారు. హెచ్‌ఎం టి.మురళీబాబు, నరాల కృష్ణ తదితర గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా గజానన సంకష్టహర చతుర్థి



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

బోట్‌క్లబ్‌: స్వయంభు భోగి గణపతి పీఠంలో బుధవారం సంకష్ట హర చతుర్థి సందర్భంగా నగర సంకీర్తన నిర్వహించారు. వినాయకునికి ఉండ్రాళ్లు, కొబ్బరి కాయలు, బెల్లం, అరటి పండ్లు నైవేద్యంగా సమర్పించారు. గణపతి సహస్రనామం పఠించి ప్రదక్షిణలు చేశారు. పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ చతుర్థి ఉపవాసకులకు రవిక, పసుపు, కుంకుమ, అల్పాహారం ఏర్పాటు చేస్తామన్నారు. సంకట చతుర్థిలో పూజించిన అష్ట గణపతి విగ్రహాలకు నవ రాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక దీపారాధన జరుగుతుందన్నారు.

రేపు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

కాకినాడ: వార్షిక మర్మతుల నిమిత్తం కాకినాడ డి7 సెక్షన్‌ పరిధిలోని శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎ.ప్రసాద్‌ పేర్కొన్నారు. 33/11 కేవీ డైరీ ఫామ్‌ విద్యుత్‌ సబ్‌–స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ పళ్లంరాజునగర్‌ ఫీడర్‌పై గల పళ్లంరాజునగర్‌ 1, 2, 3, 4, 5 వీధులు, సెవెన్‌ హిల్స్‌ రోడ్‌, అయోధ్యనగర్‌ 1, 2, 3 వీధులు, ఆదిత్య కాలేజ్‌ రోడ్‌, ఇందిరాకాలనీ, సాంబమూర్తినగర్‌ 4, 5వ వీధి పరిసర ప్రాంతాలకు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుందన్నారు. విద్యుత్‌ వినియోగదారులు, ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని ఈఈ తెలిపారు.

డీ–4 పరిధిలో..

కాకినాడ రూరల్‌: వార్షిక మరమ్మతుల నిమిత్తం కాకినాడ డిస్ట్రిబ్యూషన్‌ లైన్‌ డి – 4 పరిధిలో శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్‌ ఆపరేషన్‌ ఈఈ జి.ప్రసాద్‌ తెలియజేశారు. సర్పవరం విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఆశ్రమం స్కూల్‌ ఫీడర్‌పై రమణయ్యపేటలోని ఇందరాకాలనీ, సర్పవరం జంక్షన్‌, ఏపీఐఐసీ కాలనీ, ఎస్‌ఆర్‌ఎంటీ మాల్‌ ఏరియా, పోలీసు స్టేషన్‌ ఎదురుగా, తహసీల్దార్‌ కార్యాలయం, స్పెన్సర్‌ ఏరియా, శ్రీనివాస బ్యాంక్‌ కాలనీ, వేగుళ్ల పాపయ్య వీధి, రాజేంద్రనగర్‌, లలితానగర్‌ బ్యాంక్‌ కాలనీ తదితర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని బుధవారం ఆయన కోరారు.

అణగారిన వర్గాల ఆవేదనే జాషువా కవిత్వం

పెద్దాపురం: అణగారిన వర్గాల ఆవేదనే జాషువా కవిత్వమని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో బుధవారం ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో జాషువా వర్ధంతి సభ రొంగల వీర్రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ అణగారిన వర్గాల పట్ల వివక్షకు వ్యతిరేకంగా జాషువా తన కలాన్ని ఆయుధంగా మలిచిపోరాడారన్నారు. అసమానతలు లేని సమాజం కోరుకునే ప్రతి ఒక్కరికీ ఆయన కవిత్వం స్ఫూర్తినిచ్చిందన్నారు. చల్లా విశ్వనాథం మాట్లాడుతూ సమానత్వాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ ఆయన బాటలో అణగారిన వర్గాలకు అండగా కుల వివక్షకు వ్యతిరేకంగా తమ కలాలతో పోరాడేలా స్ఫూర్తి నింపారన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పీఎన్‌ఎం నాయకులు దారపురెడ్డి కృష్ణ, నీలం శ్రీను, దారపురెడ్డి సత్యనారాయణ, వడ్డి సత్యనారాయణ, సిరిపురపు శ్రీనివాస్‌. ఐద్వా నాయకులు రొంగల సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పీఎన్‌ఎం నాయకులు

నాటి క్రీడలను నేటి తరానికి పరిచయం చేయాలి

ఏపీఎస్పీ హైస్కూల్‌ స్పోర్ట్స్‌ డేలో డీఈఓ రమేష్‌

కాకినాడ రూరల్‌: అంతరించిపోతున్న క్రీడలు తొక్కుడు బిళ్ళ, ఏడు పెంకులాట, కోతి కొమ్మచ్చి, అష్టాచమ్మా, ఖోఖో, కబడ్డీ వంటి క్రీడలను నేటి తరానికి పరిచయం చేసేందుకు శిక్షా సప్తాహ్‌లో భాగంగా మూడో రోజు ఏర్పాటు చేసిన స్పోర్ట్స్‌డే దోహదం చేస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్‌ పేర్కొన్నారు. ఏపీఎస్పీ జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో హైస్కూల్‌ ప్లస్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. క్రీడోత్సవాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులకు స్టీల్‌ ప్లేట్లను పంపిణీ చేసి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్కూల్‌ ప్రిన్సిపల్‌ కె.గాయత్రి, ఏఎంఓ రామారెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్‌, జోగిరెడ్డి, పాల్‌ రాజు, పీడీలు కిరణ్‌కుమార్‌, త్రిమూర్తులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంప్రదాయ క్రీడలు

నాగమల్లితోట జంక్షన్‌ (కాకినాడ సిటీ): స్థానిక తిలక్‌ స్ట్రీట్‌లో ఎస్‌ఎస్‌ఆర్‌కే మున్సిపల్‌ కార్పొరేషన్‌ పాఠశాలలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా బుధవారం విద్యార్థులకు సాంప్రదాయ క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం డి.గౌరీశంకర్‌ అధ్యక్షత వహించగా, కాకినాడ అర్బన్‌ ఎంఈఓ రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరం అన్నారు. క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందించడానికి దోహద పడతాయన్నారు. ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బాడీ బిల్డింగ్‌, తొక్కుడు బిళ్ల, కుంటాట, పులిమేక, అష్టాచెమ్మ, వైకుంఠపాళి తదితర క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడల్లో 600 మంది పాల్గొన్నారు. ఈ పోటీల నిర్వహణలో పీఈటీ సూరిబాబు, ఉపాధ్యాయులు పుష్పగిరి తదితరులు పాల్గొన్నారు.



శిక్షా సప్తాహ్‌లో భాగంగా ఎస్‌ఎస్‌ఆర్‌కే పాఠశాలలో బాడీ బిల్డింగ్‌ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



ఏపీఎస్పీ స్కూల్‌ క్రీడోత్సవంలో పాల్గొన్న డీఈఓ రమేష్‌ తదితరులు

జాగ్రత్తలతో ముంపు నష్ట నివారణ



కొంగోడులో మునిగిన వరినాట్లను పరిశీలిస్తున్న ఏడీఏలు మాధవి, బాబూరావు, ప్రజాప్రతినిధులు

కరప: జిల్లాలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు నారుమడి నుంచి వరినాట్లు వరకు వివిధ దశలలో ఉన్న సార్వాపంట ముంపునకు గురైందని, కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే నష్టాన్ని కొంత నివారించుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ పి.మాధవి అన్నారు. మండల పర్యటనలో భాగంగా బుధవారం ఆమె కరప సబ్‌ డివిజన్‌ ఏడీఏ కె.బాబూరావు, వ్యవసాయసిబ్బందితో కల్సి కొంగోడు, గొర్రిపూడి, పాతర్లగడ్డ తదితర గ్రామాల్లో పర్యటించి, ముంపు పొలాలను పరిశీలించి పలు సూచనలిచ్చారు. వారి వెంట కొంగోడు సర్పంచ్‌ నక్కా బాబులు, మాజీ ఎంపీటీసీ ఆట్ల గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో అబ్కారీ ల్యాబ్‌ తొలగించాలి

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీలో అబ్కారీ (మద్యం పరీక్షలు)ల్యాబ్‌ను తొలగించేలా వీసీ ఆదేశాలు జారీచేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ బుధవారం ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేసింది. పర్యావరణ పరిరక్షణకు కృషిచేసి వర్సిటీలో మరింత పచ్చదనం పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు పి.వరహాలు, కార్యదర్శి గంగా సూరిబాబు ఉన్నారు.

నేడు డయల్‌ యువర్‌ డీఎం

తుని: తుని పరిసర ప్రాంత ప్రయాణికుల సమస్యలపై గురువారం డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్‌ ఎస్‌.కిరణ్‌కుమార్‌ బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయాణికులు 73827 81490 నంబరుకు ఫోన్‌ చేసి తమ సమస్యలతో పాటు సూచనలు, సలహాలు తెలియజేయవచ్చని తెలిపారు.

కళ్లకు గంతలతో కార్మికుల నిరసన

సామర్లకోట: రాక్‌ సిరామిక్స్‌లో తొలగించిన కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. స్థానిక ఏడీబీ రోడ్డులో రాక్‌ సిరామిక్స్‌లో పని చేస్తున్న కార్మికులను తొలగించి 100 రోజులు పూర్తి కావడంతో ఫ్యాక్టరీ యజమాన్యం మొండి వైఖరికి నిరసనగా కళ్లకు గంతలు కుట్టుకొని నిరసన తెలిపారు. ఫ్యాక్టరీలో 18 ఏళ్ల పాటు వెట్టి చాకిరి చేయించుకుని తొలగించారని, ప్రస్తుతం తమకు 40 ఏళ్ల వయస్సు దాటి పావడంతో ఏ కంపెనీ ఉపాధి కల్పిస్తారని కార్మికులు చంద్రశేఖర్‌, గంగాధర్‌, సతీష్‌, రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని వారు తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యల పట్ల స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వరప్రసాద్‌, మల్లికార్జునరావు, శివనారాయణ, ప్రభుదాసు, చంద్రన్న, రామచంద్రయ్య, రాజబాబు, సతీష్‌కుమార్‌, సుబ్బారావు పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేసిన కార్మికులు

నేడు తుని నియోజకవర్గంలో కలెక్టర్‌ పర్యటన

తుని రూరల్‌: తుని నియోజకవర్గంలో గురువారం జిల్లా కలెక్టర్‌ షాన్‌ మోహన్‌ పర్యటించనున్నారు. ఉదయం పది గంటలకు తొండంగి మండలం, మధ్యాహ్నం ఒంటి గంటకు తుని పట్టణం, తుని మండలం, ఆ తర్వాత కోటనందూరు మండలాల్లో పర్యటిస్తారు. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, పారిశుధ్య పరిస్థితులు, తాగునీటి వసతులు, క్లోరినైజేషన్‌, నాడు నేడు పనుల పరిశీలనతో పాటు తుని ఏరియా ఆస్పత్రిలో తనిఖీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

రికార్డుల భద్రతలో రాజీలేదు

- తేడా వస్తే చర్యలు తప్పవు
- ఆర్డీఓ జేఎస్‌ రామారావు

పెద్దాపురం: రెవెన్యూ రికార్డుల భద్రతలో ఎటువంటి తేడాలు వచ్చిన సహించేది లేదని ఆర్డీఓ జేఎస్‌ రామారావు హెచ్చరించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఉన్న రెవెన్యూ రికార్డులను బుధవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ డివిజన్‌ పరిధిలోని ఆయా మండలాల పరిధిలో సంవత్సరాల వారీగా అన్ని రికార్డులకు సంబంధించిన ప్రతి ఫైల్‌ కార్యాలయంలో ఉండాల్సిందేనన్నారు. ఫైళ్లను భద్రపరచాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఎల్‌సీసీ, అస్సైన్‌మెంట్‌ ల్యాండ్‌, ఇళ్ల స్థలాలకు సంబంధించిన రికార్డులు మండలాల వారీగా ఉన్న డేటా డివిజన్‌ కేంద్రంలో ఉంచాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ప్రతి రోజూ రికార్డుల పర్యవేక్షణకు ఇద్దరు సిబ్బందితో రాత్రిపూట ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రికార్డుల భద్రతపై నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన ఆయా గదుల్లో ఉన్న రికార్డుల భద్రతను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట కార్యాలయ డీటీ భానుకుమార్‌, సిబ్బంది ఉన్నారు.



ఆర్డీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ రామారావు